తప్పులు లేకుండా ఇందిరమ్మ సర్వే చేపట్టాలి

తాంసి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలనుసారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తప్పులు లేకుండా సర్వే చేయాలని మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ ఆదేశించారు. సోమవారం మండలకేంద్రంలో ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఎవరూ ఇల్లు లేకుండా ఉన్నారో వివరాలు సేకరించారు. ఇల్లు కట్టుకునేందుకు ఖాళీ స్థలం ఎంత వరకు ఉంది అనే విషయంపై ఆరా తీశారు. సంబంధిత సిబ్బంది పక్షపాత ధోరణి లేకుండా సర్వే చేయాలని, ఈ సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో నమోదు చేయాలని ఆయన సూచించారు.


గంగాజలంతో కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయానికి తరలి వస్తున్న మెస్రం వంశీయులు(ఫైల్)

నేటి నుంచి కేస్లాపూర్ నాగోబా జాతర

- 30న పెర్సిపేన్, బాన్కపేన్ పూజలు
- 31న నాగోబా దర్బార్
- 1న బేతాల్, మండగాజలింగ్ పూజలు
- తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా, చత్తీష్‌గఢ్ రాష్ట్రాల నుంచి తరలిరానున్న ఆదివాసీ గిరిజనులు

వివరాలు 7వ పేజీలో...



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి : ఏఐవైఎఫ్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్న కారణంగా పేదవిద్యార్థులు చదువులకు దూరం కావాల్సిన పరిస్థితులున్నాయని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెస్రం భాస్కర్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలనే డిమాండ్‌తో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెస్రం భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.7వేల 700 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యార్థులతోపాటు యాజమాన్యాలు కూడా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. తల్లిదండ్రులు కూలీనాలి చేసి ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని తెలిపారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో అయితే కళాశాలలు మూసుకునే పరిస్థితులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్‌లో ఉన్న వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గేడం కేశవ్, ప్రవీణ్, శిరిష, స్రవంతి, నిషా, శివని, ప్రణయ్, సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న శోభన్‌బాబు

జిల్లా పేరును నిలబెట్టాలి

: జాయింట్ సెక్రెటరీ శోభన్‌బాబు

నేరడిగొండ , జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా పేరును నిలబెట్టాలని సాఫ్ట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ శోభన్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మహిళల, పురుషుల సాఫ్ట్ బాల్ సీనియర్ క్రీడాకారుల శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాఫ్ట్ బాల్‌లో జిల్లా పేరును నిలబెట్టాలన్నారు. జాతీయ స్థాయిలోనే కాకుండా ఇంటర్ నేషనల్ లెవల్‌లో ఆడాలని వారికి ఆశీర్వాదం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్, మెదక్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు గోడం జ్యోతిరామ్, నిర్వాహక కార్యదర్శి అఖిల్, పీడీ అసోసియేషన్ సభ్యులు రాధేశం, నాగరాజు, తదతరులు పాల్గొన్నారు.

గురుకులంలో చేరాలంటూ వినూత్న ప్రచారం

బోథ్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సంగీత విద్యార్థులను గురుకుల పాఠశాలలో చేర్పించాలంటూ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా సోమవారం 5వ తరగతిలో అడ్మిషన్ కోసం రాత పరీక్షకు హాజరు కావాలని ఆటోకు ఫ్లెక్సీ పెట్టి ప్రచారం చేశారు. గురుకులంలో చేరితే బంగారు భవిష్యత్తు ఉంటుందంటూ వివరించారు. కాగా, ప్రిన్సిపాల్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల మండల ప్రజలు హర్షించారు.


ఆటో ద్వారా ప్రచారాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

కౌలు రైతుకు.. 'భరోసా' ఏదీ!?


భూమిని చదును చేస్తున్న రైతు(ఫైల్)

- జిల్లాలో రైతు భరోసా పథకానికి మళ్లీ దూరమవుతున్న కౌలు రైతులు
- పంటలను సాగు చేస్తున్నా.. అందని పెట్టుబడి సహాయం
- ఆత్మీయ భరోసాపై ఆశలు పెట్టుకుంటున్న అన్నదాతలు
- ప్రభుత్వ విధానాలతో దిక్కుతోచని స్థితిలో రైతులు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 28,763 మంది కౌలు రైతులు

ఆదిలాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకానికి కౌలు రైతులు మళ్లీ దూరమవుతున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకానికి కూడా నోచుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సహాయం కౌలు రైతులకు అందేలా లేదు. రైతుభరోసా పథకాన్ని అమలు చేసేందుకు క్షేత్ర స్థాయిలో సర్వేను చేపట్టి సాగుకు యోగ్యంకాని భూముల వివరాలను సేకరించారు. దీని ఆధారంగానే గ్రామసభలు ఏర్పాటు చేసి అనర్హుల జాబితాను వెల్లడించారు. కానీ ఎక్కడా కౌలు రైతుల ఊసేత్తినట్లు కనిపించ లేదు. మళ్లీ భూమిని కలిగి ఉన్న రైతులకే పెట్టుబడి సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతోకౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. అంతేకాక రాత్రనక, పగలనక పంటలను సాగు చేస్తున్న కౌలు రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఎలాంటి సహాయానికి నోచుకోవడం లేదు. గతంలోనే కౌలు రైతులకు కూడా రైతుబంధు పథకం కింద పెట్టుబడి సహాయాన్ని అందించాలనే డిమాండ్లు వచ్చాయి. దీంతో ప్రభుత్వం పరిశీలిస్తామని ప్రకటించింది. అయిన ఇప్పటి వరకు పెట్టుబడి సహాయంపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో 18 మండలాల పరిధిలో 509 రెవెన్యూ గ్రామాలలో సుమారుగా 28వేల 763 మంది కౌలు రైతులు ఉన్నారు. భూమి లేదన్న కారణంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందక పోవడంతో కౌలు రైతుల పరిస్థితి అధ్వానంగా మారిందంటున్నారు.

ఆత్మీయ భరోసా డౌటే!!

ఇటీవల రైతుభరోసా పథకాన్ని అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం గ్రామసభలను నిర్వహించి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులను తీసుకుంది. కాని ఎక్కడ కౌలు రైతుల ఊసెత్తక పోవడంతో రైతులు ప్రభుత్వ సహాయం


పత్తి పంటలో కలుపు తీస్తున్న రైతు కూలీలు(ఫైల్)

కోసం దరఖాస్తు చేసుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూసమగ్ర సర్వేలోను కౌలు రైతులకు అవకాశం దక్కలేదు. అయితే జిల్లాలో ఎక్కువగా కౌలు రైతులే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆర్థిక, వాతావరణ పరిస్థితులకు తోడు ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలోనే రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. అయితే ఎలాంటి భూమిలేని రైతు కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. ఇప్పటికే ఈ పథకాన్ని లాంచనంగా ప్రారంభించింది. కానీ కౌలు రైతులకు భరోసా అందడం కష్టంగానే కనిపిస్తోందంటున్నారు. ఎందుకంటే గ్రామాల్లో ఎకరం.. ఆలోపు భూమిని కలిగి ఉన్న రైతులే ఎక్కువగా సాగుభూములను కౌలుకు తీసుకొని పంటలను సాగు చేస్తున్నారు. అయితే గుంట భూమిని కలిగి ఉన్న వారికి ఆత్మీయ భరోసా వర్తించదని అధికారులు చెబుతున్నారు. దీంతో దాదాపుగా ఈ పథకానికి కూడా కౌలు రైతులు అర్హులయ్యేలా కనిపించడం లేదు. ఎలాంటి ఆధారం లేని రైతు కూలీలకు మాత్రమే ఆత్మీయ భరోసా అందే విధంగా చర్యలు చేపడుతున్నారు.

గత్యంతరం లేకనే..

వ్యవసాయం తప్ప మరే రంగంలో పరిజ్ఞానం లేని కౌలు రైతులు గత్యంతరం లేకనే పంటలను సాగు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించడంలో నిండు నిర్లక్ష్యం వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారిన కౌలు రైతుల పరిస్థితి మారడం లేదంటున్నారు. ఇప్పటికే అటవి భూములపై హక్కు పొందిన రైతులతో పాటు అసైన్డ్ భూములు, ఏజెన్సీ భూములను కలిగి ఉన్న రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నారు. కానీ కౌలు రైతులను గుర్తించి బ్యాంకు రుణాలతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గుంట భూమి నిబంధనతో ఆత్మీయ భరోసా కూడా అందేలా లేదు. దీంతో కౌలు రైతు లు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాలతో సాగులో ఏటా నష్టాలే మిగులుతున్న గత్యంతరం లేని పరిస్థితుల్లోనే వ్యవసాయంపై ఆధారపడాల్సి వస్తుందంటున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాక పోవడంతో కనీసం కౌలు చెల్లించే పరిస్థితి లేదంటున్నారు. మళ్లీ కౌలును చెల్లించేందుకు కూడా అప్పులే చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

కౌలు రైతుపై చిన్నచూపేనా?!

భూమి లేదన్న కారణంగా ప్రభుత్వం, బ్యాంకులు

(తరువాయి 6వ పేజీలో...)

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ శ్యామలదేవి ● కలెక్టరేట్‌లో 'ప్రజవాణి'కి తరలివచ్చిన అర్జిదారులు ● పాల్గొన్న ఆయా శాఖల అధికారులు


అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలదేవి


ఐటీడీఏ కార్యాలయంలో అర్జీలను స్వీకరిస్తున్న ఏపీవో జనరల్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చే అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు.ప్రజలు వారి సమస్యలను తెలియజేస్తూ అర్జీలను ఇవ్వగా వాటిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో ఇచ్చే వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కార మార్గాలను చూపాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

● గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి : వసంత్‌రావు

ఉట్నూర్: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ జాదవ్ వసంతరావు సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. లింగాపూర్ మండలం మల్కాగూడ గ్రామానికిచెందిన కొడప మారు తన పొలానికి త్రిఫేజ్ విద్యుత్ ఇప్పించమని, ఆసిఫాబాద్ మండలం దేగాం గ్రామానికి చెందిన పొచమ్మ తనకు బోర్‌వెల్ మంజూరు చేయించామని, ఉట్నూర్ మండలం లక్కారం గ్రామానికి చెందిన గేడం దేవరావు తన టెంట్‌హౌజ్‌లోన్ మంజూరు కల్పించామని కోరారు. పింఛన్, రెండు పడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ (పీవీటీజీ) మేస్రం మనోహర్, పీహెచ్ఓ సందీప్‌కుమార్, ఏఓ దామోదర్‌స్వామి, (పేసా కో ఆర్డినేటర్) వసంతరావు, మేనేజర్, జేడీఎం నాగభూషణం, డీపీఓ ప్రవీణ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లల్లో మొదటి ప్రాధాన్యత

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమబొజ్జుపటేల్ స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల నమునా నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులు, కాంగ్రెస్ నాయకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ఇళ్లతో పాటు పెంకుటిల్లు, కట్టెలతో నిర్మించిన వారికి మొదటగా ప్రాధాన్యత కల్పిస్తూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, కయ్యుం, ఎస్సీరెడ్డి, దాసండ్ల ప్రభాకర్, రాజేశ్ నాయక్, మహమ్మద్ ఇక్బాల్, తదితరులున్నారు.


● వాయిపేట్‌లో వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే

అలాగే, గత 22న నిర్వహించిన గ్రామసభలో అధికారులకు ప్రజలు సహకరించక పోవడం వల్ల ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామసభలు నిర్వహించి పప్రవేశ పెట్టిన నాలుగు పథకాలకు లబ్ధిదారులను ఎన్నుకుంటుందని అన్నారు. దంతనపల్లిలో 344 మందికి ఇందిరమ్మ ఇండ్లు 49 మందికి ఆత్మీయ భరోసా, 36 మందికి రేషన్‌కారులు, 350 మందికి రైతు భరోసా కల్పించడం జరిగిందన్నారు. ఆత్మీయ భరోసా పతకంలో జాబ్‌కార్డు ఉండి 20 రోజుల పాటు పని చేసిన మహిళలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో ఎంపీడీవో రాంప్రసాద్, ఈజీఎస్ ఏపీవో రజనికాంత్, కార్యదర్శి అరవింద్, ఏఎంసీ వైస్ చైర్మన్ జైవంతురావు, ఖయ్యుం, లింగంపల్లి చంద్రయ్య, మహమ్మద్ ఇక్బాల్, దాసండ్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

● ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి

సిరికొండ: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి ఆదిలాబాద్‌లో అత్యధికంగా నిధులను మంజూరు చేయించి, ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని వాయిపేట్ గ్రామంలో గల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న వాలీబాల్ పోటీలను తిలకించి క్రీడాకారులతో కాసేపు ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో రూ.15 కోట్లతో రోడ్లు వేశామన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నిధులను తెప్పించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పలు అభివృద్ధి పనుల కోసం త్వరలో రూ.36 కోట్లు మంజూరు కానున్నట్లు తెలిపారు. అలాగే, తరాలు మారుతున్న కొద్దీ సంస్కృతీ సంప్రదాయాలను నేటి తరం యువకులు మరిచిపోతున్నారని, సంస్కృతీ సంప్రదాయాలే ఓ జాతీ ఉనికికి చిహ్నాలు అని తెలిపారు. ఏళ్లుగా పాటిస్తున్న ఆచార వ్యవహారాలను తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాయిసెంటర్ పెద్దలు, గ్రామపటేల్‌లు నేటి యువతకు దిశానిర్దేశం చేస్తూ ఉండాలని సూచించారు. క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలన్నారు. అంతేకాకుండా ప్రతీఒక్క రైతు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడడం వల్ల మానవ మనుగడకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. రోగాల బారిన పడకుండా ఉండాలంటే రసాయనాల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని, దీంతో భూసారం పెరుగుతుందని అన్నారు. వచ్చేనెల 11న ప్రముఖ మోటీవేషనల్ స్పీకర్ బ్రదర్ షఫీ ఉట్నూర్‌కు రానున్నట్లు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. వెడ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో మాజీ ఎంపీ సోయం బాపురావు, మహంకాళి ఆలయ పూజారి కినక శంభు మహరాజ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తమ్, వాయిపేట్ మాజీ సర్పంచ్ పెందూర్ గంగాధర్, ఫకీర్ నాయక్‌తండా మాజీ సర్పంచ్ జాదవ్ లచ్చిరాం, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్

స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం : రిమ్స్ డైరెక్టర్ జైసింగ్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రిమ్స్ స్వచ్ఛంధ సంస్థల సహకారంతో సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం రిమ్స్ ఓపీలో 13 స్వచ్ఛంద సంస్థల సహకారంతో రోగుల సాయం కోసం హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయగా ఆయన ప్రారంభించారు. అనంతరం వయోవృద్ధుల సమాఖ్య సంఘం పాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నిత్యం రిమ్స్‌కు వచ్చే రోగుల సాయం కోసం స్వచ్ఛంద సంస్థలు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ఓపీతోపాటు వార్డులకు వెళ్లేందుకు ఇక్కడ స్వచ్ఛంద సంస్థల నుంచి వాలంటీర్లతోపాటు రిమ్స్ సిబ్బంది కూడా ఉంటారన్నారు. రోగులకు సరైన సూచనలు చేస్తారన్నారు. రక్తదానంలో రిమ్స్ బ్లడ్ బ్యాంక్ మొదటి స్థానంలో వచ్చిందన్నారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరిండెంట్ అశోక్, వయో వృద్ధుల సమాఖ్య అధ్యక్షులు దేవిదాస్ శీపాండే, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల అకౌంట్‌లోకి రైతు భరోసా నిధులు

బోథ్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచలాపూర్ గ్రామాన్ని ప్రభుత్వం పైలెట్ గ్రామం గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామానికి అందిస్తున్నారు. దీనిలోభాగంగా సోమవారం ఆ గ్రామానికి చెందిన రైతుల అకౌంట్‌లో రైతు భరోసా నిధులు రావడంతో బ్యాంకుల్లోకి వెళ్లి డబ్బులు డ్రా చేసుకున్నారు.

తాగిగూడలో అవగాహన సదస్సు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లోని తాటిగూడ ప్రభుత్వ పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిషన్ కో ఆర్డినేటర్ యశోద పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుడా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 పిల్లలకు అత్యవసర సహాయం అందించే టోల్ ఫ్రీ నెంబర్ అని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. పిల్లల సంరక్షణ, రక్షణ, పునరావాసం కోసం సహాయం అందిస్తుందన్నారు. ఇందులో హెడ్ మాస్టర్ నారాయణ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.


తలమడుగులో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో


ఆదిలాబాద్ రూరల్‌లో ఎంపీడీవో..


బోథ్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎంపీడీవో

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోండి

● తలమడుగు తహసీల్దార్ రాజమోహన్

తలమడుగు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు పత్రాలను ఆయా శాఖలు కేటాయించి వారం రోజులుగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో మేఘామాల, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్. ఏఈ కిసాన్ మిత్ర కో ఆర్డినేటర్ రమాకాంత్ యాదవ్, పీసా కో ఆర్డినేటర్ సురేష్, ఆయా గ్రామాల పంచాయితీ సెక్రటరీలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

● అవగాహన లేక అరకొరగా అర్జీలు

ఆదిలాబాద్ రూరల్: మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా మండల స్థాయిలో ప్రజావాణి సేవల వినియోగం పట్ల గ్రామీణ ప్రాంత ప్రజల్లో అవగాహన లేక అరకొరగా అర్జీలు వచ్చాయి. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కారమయ్యేలా చూడాలని ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ గోవింద్ అన్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ మండల ఎంపీడీవో కార్యాలయంలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి అర్జీదారులు రాగా వారి అర్జీలను స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కాగా మండ వ్యాప్తంగా ఐదు అర్జీలు వచ్చినట్లు తెలిపారు.ఇందులో రేషన్ కార్డుకు మూడు, రైతు భరోసాకు 2 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. కాగా మండల కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో చాలామంది ప్రజలు ఉపగించుకోలేకపోయారు. ప్రజావాణి సేవలు సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు గ్రామాల్లో అవగాహన కల్పించాలి. కార్యక్రమంలో ఎంపీవో స్వప్న శీల, ఆర్ఐ నారాయణ, జూనియర్ అసిస్టెంట్ గజానంద్ పాల్గొన్నారు.

బోథ్‌లో ప్రారంభమైన ప్రజావాణి

బోథ్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలకేంద్రంలోని ప్రజావాణి కార్యక్రమాన్ని మండల అధికారులు సోమవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా ప్రతీ సోమవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని ఎంపీడీవో రమేష్ తెలిపారు. అయితే ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనిఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో, కార్యాలయ సూపరింటెండెంట్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ప్రజావాణి

సిరికొండ: మండలంలో సోమవారం సమాచార సహాయ కేంద్రాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవీందర్ మాట్లాడుతూ...ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. మండలవాసుల సమస్యల పరిష్కారం కొరకు ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా తమ సమస్యలను త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. ఇట్టి అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సంతోష్, విమల బాయి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుకు 'భరోసా' ఏదీ !?

(5వ పేజీ తరువాయి...)

కౌలు రైతులపై చిన్నచూపు చూస్తున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. కలిసిరాని కాలంతో పంటలు నేలపాలైన పంట నష్ట పరిహారం చేతికందడం లేదు. సరిపడ కౌలును చెల్లిస్తున్న భూ యజమానులు కౌలు రైతులతో ఒప్పందం చేసుకునేందుకు వెనుకాడడంతో ఎలాంటి ఆధారం లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతునే ఉన్నారు. ఎకరాన రూ.10వేల నుంచి రూ.35వేల వరకు కౌలు చెల్లించిన పెట్టుబడి సహాయం, బీమా సొమ్ము యజమాని చేతిలోకే వెళ్లి పోతుంది. భూ యజమానులు పంటలను సాగు చేయకున్న ప్రభుత్వం పెట్టుబడి సహాయం అందించడంపై కౌలు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం కౌలు చట్టాలను అమలు చేస్తే కొంత వరకైనా మేలు జరిగే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అనాలోచిత విధానాలతో కౌలు రైతుల పరిస్థితి అగమ్య ఘోచరంగా మారింది. కౌలు రైతులకు రక్షణ కల్పించే విధంగా ఎన్నో చట్టాలు ఉన్నా- ప్రభుత్వాలకు పట్టింపే లేదంటున్నారు.


పట్టుబడిన గంజాయితో ఎక్సైజ్ శాఖాధికారులు

గంజాయి మొక్కల దహనం

ఇచ్చోడ/బోథ్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ 2.4 కిలోల గంజాయి, ఉట్నూర్ ఎక్సైజ్ పరిధిలోని 7.9 కిలోల గంజాయిని, గంజాయి మొక్కలను దహనం చేసినట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లిలో గల శ్రీ మెడికేర్ సర్వీసెస్ సెంటర్‌లోని ఎలక్ట్రిక్ యంత్రంలో వేసి దహనం చేసినట్లు అబ్కారీశాఖ అధికారులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీలోని ఓ ఇంట్లో కూలర్‌లో షార్ట్ సర్క్యూట్ జరగడం వల్ల సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సంఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందజేశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద తీవ్రత పెరగకుండా ఘటన స్థలం వద్ద ఎస్పీ ఉండి పరిస్థితిని పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.


ముక్రా(కె)లో ఫ్లెక్సీతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

'వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన'

ఇచ్చోడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ పాలన వద్దు.. రేవంత్‌రెడ్డి పాలన వద్దు అంటూ.. ఈ ప్రభుత్వంతో విసుగుచెందాం'మని మండలంలోని ముక్రా(కె) గ్రామస్థులు గ్రామంలోని పంటపొలాల్లో ఫ్లెక్సీలతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని ముక్రా(కె) గ్రామంలో గ్రామస్థులు ఫ్లెక్సీ, ఫ్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి ఇప్పటికి 13నెలలు గడుస్తున్న హామీలు నేరవెర్చలేదన్నారు. రైతు భరోసా బాకీ, మహాలక్ష్మి బాకీ,తులం బంగారం బాకీ, పింఛన్ బాకీ, 2లక్షల ఉద్యోగాలు బాకీ అంటూ కాంగ్రెస్ పాలనా మాకు వద్దని డిమాండ్ చేశారు. ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామానికే పథకాలు ఇస్తామంటే మిగిలిన గ్రామాలు మీకు ఓటు వేయలేదా.. అంటూ నువ్వు రాష్ట్రానికి ముఖ్యమంత్రివా.. లేక గ్రామానికి ముఖ్యమంత్రివా అంటూ నిరసన వ్యక్తపరిచారు. 6 గ్యారంటీలను అమలు చేయకుంటూ ప్రతీ గ్రామంలో నిరసన కార్యక్రమాలు చేపట్టి నిలదీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గాడ్గె మీనాక్షి, సుభాష్, రైతులు తిరుపతి, విఠల్, దత్త, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆయాను సన్మానించిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు

ఉట్నూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు మండలంలోని లక్కారం అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన ఆయా రంభబాయి గతణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఉద్యోగ అవార్డు పొందినందుకు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుంర ఈశ్వరిబాయి ఆమెను సన్మానించారు. గణతంత్ర వేడుకల్లో ఐటీడీఏ పీఓ, ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ చేతుల మీదుగా ఆయా అవార్డు అందుకోవడంతో సోమవారం అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకొని ఆయాను శాలువాతో స్థానిక మహిళలతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 35ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న రంభబాయి చేతుల మీదుగా అనేక మంది పిల్లలు పెరిగి ప్రయోజకులు అయ్యారని, ఉత్తమ ఆయాగా ఎంపిక కావడం సంతోషకరమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, స్థానిక ఆశావర్కర్ యశోధ, మహిళలు కౌసల్య, మాజీ వార్డు సభ్యురాలు సీపతి లక్ష్మి, రాజవ్వ, మరసుకోల సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నేరడిగొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో 25 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. నేరడిగొండ మండల కేంద్రంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నాయకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్‌రావు, మాజీ సర్పంచ్ జనార్ధన్, జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, మధుకర్, మాజీ సర్పంచ్ జనార్ధన్, జిల్లా సీనియర్ నాయకులు మధుకర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నాయుడి రవి, మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ వకీల్, మాజీ సర్పంచ్ ఆత్రం నగేష్, సయ్యద్, అన్వర్, ఇషాక్, మనోజ్, ఎం.డి.సద్దాం, పాల శంకర్, క్రిష్ణ, రహిల్, మాలిక్, వివిధ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలను నడపొద్దు

జైనథ్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లోని వివిధ వాహనదారులు, డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడపొద్దని ఎస్సై పురుషోత్తం అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని గ్రామస్తులు, వివిధ వాహనదారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని రోడ్డుకు పక్కన గల జాబ్రా గుర్తులను పాటించాలన్నారు. దీంతోపాటు వాహనాలు పడిపేటప్పుడు అతి వేగంగా నడుపుతూ సెల్ ఫోన్‌లో మాట్లాడొదన్నారు. పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వాహనదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


లక్ష్మిపూర్‌లో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై

గిరిజనుల సాగులో ఉన్న

అటవీ భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

● ఐటీడీఏ కార్యాలయం ముందు గిరిజనుల ధర్నా

ఉట్నూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గిరిజనుల సాగులో ఉన్న అటవి భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుకుంటు గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు సోమవారం గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వెంకటాద్రి నువ్వు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి యేడాది దాటుతున్న గిరిజనులకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం మహిళలకు ఉచిత సుప్రయాణం కల్పించి అన్ని చేశామని చెప్పుకుంటుందన్నారు. అడవిముల సర్వేలో జరిగిన అవకతవకులను సరి చేయాలని, తక్షణం పట్టాలు ఇవ్వాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములలో అడవి అధికారులు వచ్చి కందకాళ్ల తొవ్వడం మొక్కలు నాటడం తక్షణం నిలిపి వేయాలని, సాగు చేసుకుంటున్నా భూమిలేని పేదల పై ఫారెస్టు అధికారులు పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని, గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి సాగులో ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలని, ఉట్నూర్ జన్నారం ప్రాంతాల్లో ఇండ్లు లేని పేదలు నివసిస్తున్న ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాలలోని రహదారులను, రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలని, ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని, పాముకాట్లు, క్రూరమృగాల దాడులలో ప్రాణాలు కోల్పోయిన వారికి, అప్పుల బాధలతో ఆత్మహత్యలు చేసుకున్న వారికి ప్రభుత్వం పరిహారం చెల్లించి కుటుంబాలను ఆదుకోవాలని, రైతుబంధు ఎకరానికి రూ.15వేలు పెంచుతామని చేసిన వాగ్ధానాన్ని తక్షణం అమలు చేయాలని, కౌలు రైతులకు రైతుబంధు కల్పించాలని, అర్హులైన బీదలకు ఇందిరమ్మ ఇండ్లు రేషన్‌కార్డులు ఇవ్వాలని, 57ఏళ్లు నిండిన వారికి పెన్షన్లు ఇవ్వాలని, ప్రతి మహిళకు నెలకు 2500 ఇచ్చే పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రవంలో జిల్లా అధ్యక్షుడు స్వయం జోగారావు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు సిడాంధర్మపటేల్, వాగుమరి సాంబాజి, సంధ్యారాణి, మోరేగణేష్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న గ్రామీణ పేదల సంఘ సభ్యులు, గిరిజనులు

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

● పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బాపురావు

జైనథ్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేని సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి చిల్కూరి బాపురావ్ అన్నారు. సోమవారం మధ్యాహ్నం భోజన విరామం సమయంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ శ్యాం సుందర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ అసోసియేట్ అధ్యక్షులు ఎలగుర్తి శ్రీనివాస్, పీఆర్టీయూ సీనియర్ నాయకులు ఎ.దయనంద్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటరమణ, వెంకట్ యాదవ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జైనథ్‌లో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

నేరడిగొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీపీఎస్/యూపీఎస్ పెన్షన్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తూ పాత పెన్షన్ ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సోమవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీపీఎస్/యూపీఎస్ పెన్షన్ స్కీమ్‌నకు వ్యతిరేకిస్తూ పాత పెన్షన్ ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర, జిల్లా శాఖలు ఇచ్చిన పిలుపు మేరకు నేరడిగొండలో పీఆర్‌టీయూ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ యూపీఎస్ పెన్షన్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తూ వినతిపత్రం అందజేశారు. ఇందులో మండల అధ్యక్షుడు కటుకూరి గంగాధర్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు మల్లీశ్వరి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, తదితరులున్నారు.

ఇచ్చోడ: పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మెనిఫెస్టోలో చెప్పిన విధంగా ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ఓపీఎస్ పునరుద్దరించాలన్నారు. ఇందులో పీఆర్‌టీయూ మండల శాఖ సభ్యులు మహెందర్, పవార్, సంతోష్, కాశీనాథ్, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

ఆష్ట ఘటనపై చలించిన అధికారులు

ముథోల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆష్ట గ్రామంలో గల కాలనీలో చిన్న గజ్జన్న మద్యం కొరకు వచ్చిన పింఛన్ డబ్బులు ఇవ్వమని 70 ఏళ్ల వయసు గల తల్లి హీరాబాయికి అడుగగా ఆమె నిరాకరించింది. దీంతో తల్లిని కర్ర, కొడవలితో హత్య చేయడంతో జైలుకు వెళ్లిన సంగతి విదితమే. దీంతో నిందితుడి భార్య కరోనా సమయంలో చనిపోయింది. ప్రస్తుతం నిందితుడికి 9 సంవత్సరాల కుమార్తె పుష్ప, 14 సంవత్సరాల కుమారుడు గంగాధర్‌లు అనాధలు అయ్యారు. దీంతో సోమవారం ఈ విషయం తెలుసుకున్న ముథోల్ ఎంపీడీవో శివకుమార్ ఆష్ట గ్రామానికి చేరుకొని పిల్లలతో మాట్లాడారు. తనవంతుగా రూ. 5,000లతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయించి ఏదైనా కాంట్రాక్ట్‌తో కట్టించేందుకు చర్యలు చేపడతానని తెలిపారు. అలాగే తహసీల్దార్ శ్రీకాంత్ తనవంతుగా రూ.5,000ల ఆర్థిక సహాయంతో పాటు 25 కిలోల బియ్యాన్ని అందజేశారు.

అలాగే పిల్లల పేర్లను వెంటనే రేషన్‌కార్డులో యాడ్ చేసి సంబంధిత మంజూరు పత్రాన్ని అందజేశారు. అలాగే పంచాయతీ కార్యదర్శి గంగాధర్ తనవంతుగా 25 కిలోల బియ్యాన్ని అందించారు. అనాధలైన పిల్లలను సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు చేపడుతామని ఎంపీడీవో, తహసీల్దార్లు పేర్కొన్నారు. దీంతో పాటు ఆష్ట గ్రామానికి చెందిన నాయ కులు రావుల శ్రీనివాస్ తనవంతుగా పది వేల రూపాయలు అందజే యడంతో పాటు ఎవరైనా దాతలు చిన్నారులకు ఆర్థిక చేయూత ఇవ్వాలని వాట్సాప్ ద్వారా ప్రచారం చేస్తున్నారు.

బాసర ఆర్జీయూకేటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల ఆందోళన

బాసర, జనవరి, 27: (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సోమవారం నిరసన తెలిపారు. 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం తమపై చిన్నచూపు చూసిందని ఆందోళన వ్యక్తపరుస్తూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్రధాన ద్వారం వద్ద బైటాయించారు. యూజీసీ పే స్కేల్‌తో కూడిన గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేశారు., బేసిక్ డీఏ, హెచ్ఆర్‌తో పాటు 3 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు.

సాగునీటిని విడుదల చేయాలని వినతి

నిర్మల్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ మండలంలోని వెంగ్వాపేట్, తల్వేద, చిట్యాల గ్రామాల రైతులు సోమవారం రోజు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్య క్షుడు శ్రీహరిరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంటనే స్పందించిన శ్రీహరి రావు ఇరిగేషన్ ఏఈతో మాట్లాడి సాగునీటిని విడుదల చేయాలని సూచించారు. పీసీసీ సభ్యులు సాధ సుదర్శన్ తదితరులున్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.7.8 కోట్ల నిధులు మంజూరు

భైంసా, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నియోజక వర్గ పరిధిలో రోడ్ల నిర్మాణం కోసం గాను రూ.7.8 కోట్ల నిధులు మంజూరైనట్లుగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ వెల్లడించారు. సోమవారం ప్రకటన ద్వారా నిధులు మంజూరి విషయాన్ని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజూరైన సంబంధిత నిధుల ద్వారా తానూర్ మండల కేంద్రం నుంచి రాష్ట్ర సరిహద్దులోని మహారాష్ట్ర హుండా రోడ్డు వరకు రూ.5.9 కోట్లు, కుంటాల మండల కేంద్రం నుంచి దౌనెల్లి మీదుగా మహారాష్ట్ర సరిహద్దు వరకు రూ.1.9కోట్లు రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లుగా వివరించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

మామడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సహకార సంఘాలలో తీసుకున్న వ్యవసాయ రుణాలు సకాలంలో చెల్లించాలని ఆదిలాబాద్ డీసీసీబీ డైరెక్టర్ పీఏసీఎస్ చైర్మన్ చిక్యాల హరీష్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సహకార వ్యవసాయ సంఘం సమావేశం నిర్వహించారు.


కౌటా(బి) ఉన్నత పాఠశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న షీ టీమ్ అధికారులు

'ఇబ్బంది పడితే 100కు కాల్ చేయాలి'

భోథ్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లల పట్ల ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడినా.. అసభ్యకరంగా ప్రవర్తించినా.. డయల్-100కు కాల్ చేయాలని షీ టీమ్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ బి.సుశీల పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కౌటా(బి) ఉన్నత పాఠశాలలో వంద డయల్‌పై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌లో అనవసరమైన వాటిని సేకరించవద్దని ఇతర వ్యక్తులతో చాటింగ్ చేయడం తప్పని గుర్తించాలన్నారు. మీ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని చదవాలని తల్లిదండ్రుల మాట వినాలని ఆమె కోరారు. సంస్కారంతో కూడిన చదువు నేర్చుకోవాలని వివరించారు. సైబర్ క్రైమ్ కోసం 1930 నెంబర్‌ని సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులు శశిధర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపల్లి ప్రాజెక్ట్ నిర్మించాలి : దళిత జేఏసీ

నార్నూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నార్నూర్ మండలంలోని రైతులకు సాగు నీరు అందించేలా ఎంపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని దళిత జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్ మానే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అన్నింటికీ వెనుకబడిన మండలాలు అంటే గుర్తుకొచ్చేటి కేవలం రెండే నార్నూర్, గాదిగూడ మండలాలని అన్నారు. గత ప్రభుత్వాలకు మాజీ జడ్పీటీసీ బాణోత్ జాలంసింగ్ ప్రాజెక్టు విషయంలో విన్నవిస్తూ దరఖాస్తులు చేసిన సంగతులు ఉన్నాయన్నారు. ఇక్కడ పాలించే ప్రజలకు ఓట్ల తప్ప అభివృద్ధిపై దృష్టి లేదన్నారు. ముఖ్యంగా ప్రాంతం అభివృద్ధి జరగాలంటే రైతులు బాగుండాలి, సాగునీరు అందిస్తే అవసరమనే పంట పండించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇక్కడి రైతులకు ఒకటే పంటపైన ఎక్కువ ఆధార పడుతున్నారన్నారు. రెండో పంట కావాలంటే సాగునీరు ఇబ్బంది పడతారు అదే ఎంపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేస్తే దాదాపుగా 5వేలకు పైగా ఎకరాలకు నీరు అందుతుంది పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు సిద్దార్థ, రాము, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : ఏఐటీయూసీ

ఆదిలాబాద్ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల కోడి గుడ్ల బిల్లులను చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల తోపాటు పెండింగ్ బిల్లులను చెల్లించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు శ్రీదేవి, నాగమణి, రాంబాయి, పుష్ప, ఇస్రు, రుక్మాబాయి, శకుంతల, అనిత పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం కోడి గుడ్డు పెట్టాలని చెబుతున్న అధికారులు దానికి అనుగుణంగా బిల్లులు ఇవ్వాలని కుంటాల రాములు అన్నారు. బహిరంగ మార్కెట్‌లో గుడ్డ ఎనిమిది,ప్రభుత్వం ఇచ్చే బిల్లు కంటే రూ.రెండు, రూ.3 భారం కార్మికులపై పడుతోందన్నారు. తొమ్మిది నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున కష్టలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రూ.10 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించారని, కానీ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే సమ్మె చేపడతామని హెచ్చరించారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

● పార్టీలోకి ఆహ్వానించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్

నేరడిగొండ , జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు హరస్ మారుతి పటేల్, రాథోడ్ సంజీవ్‌లు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా వారిని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా మారుతి పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ ఏఎంసీ వైస్ చైర్మన్ చౌహాన్ శేషారావు, బోథ్ మండల వైస్ చైర్మన్ ఆడే వసంత్‌రావు, ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కల్లెం నారాయణ్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ మహ్మద్ ముస్తఫా, ఇచ్చోడ మండలం ప్రధాన కార్యదర్శి చోలే ప్రభాకర్, జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి కేస్లాపూర్ నాగోబా జాతర

భక్తి

● జాతరకు సర్వం సిద్ధం ● 30న పెర్సిపేన్, బాన్పేన్ పూజలు ● 31 నాగోబా దర్బార్
● 1న బేతాల్, మండగ జలింగ్ పూజలు ● అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు


గంగాజలం కోసం మెస్రం వంశీయుల ప్రయాణం (ఫైల్)


కోనేరు నుంచి నీటిని తీసుకువస్తున్న మహిళలు


నాగోబా జాతర ప్రచార రథం (ఫైల్)

ఇంద్రవెల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల ఆరాధ్యదైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం లోని కేస్లాపూర్ నాగోబా జాతరకు అంతా సిద్ధమైంది. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం రాత్రి 11 గంటలకు మహాపూజల నిర్వహణతో జాతర ప్రారంభం కానుంది. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే నాగోబా మహాపూజలు ఘనంగా నిర్వహించడానికి మెస్రం వంశీయులు సిద్ధమయ్యారు. శుక్రవారం ప్రారంభమయ్యే జాతర అధికారికంగా ఫిబ్రవరి 4 వరకు కొనసాగుతోంది. మహాపూజలో భాగంగా పవిత్ర గంగాజలంతో నాగోబాను అభిషేకించి, ఏడురకాల నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీ. గంగాజలం కోసం 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంచిర్యాల జిల్లాలోని జన్నారం మండలంలో ఉన్న గోదావరి నదిలోని హస్తినమడుగు నుంచి జలం తీసుకుని కాలినడకన ఈనెల 25న కేస్లాపూర్ మర్రిచెట్టు వద్దకు చేరుకున్నారు. సోమవారం అక్కడ వివిధ రకాల పూజలు నిర్వహిస్తుండగా ఆయా ప్రాంతాల్లోని మెస్రం వంశీయులు అక్కడికి చేరుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా ఆదివాసీలు, గిరిజనులు జాతరకు తరలివస్తున్నారు. మంగళవారం ఉదయం మెస్రం వంశీయులు సంప్రదాయ వాయిద్యాలైన డోలు, పేప్రే, కాళికోమ్ వాయిస్తూ నాగోబా ఆలయానికి చేరుకుంటారు. వివిధ పూజల అనంతరం గోదావరి నది నుంచి తీసుకొచ్చిన జలంతో ఆలయాన్ని శుద్ధి చేసి, నాగోబాకు జలాభిషేకం చేసి మహాపూజలు నిర్వహిస్తారు. పూజల సమయంలో మెస్రం వంశీయులను తప్ప ఇతరులెవరినీ ఆలయలోకి అనుమతించరు. పూజల తరువాత అతిథులైన జిల్లా స్థాయి అధికారులు, ఇతర ప్రముఖులు ఆలయంలోకి ప్రవేశించి పూజలు నిర్వహిస్తారు. అనం తరం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి మెస్త్రం వంశంలో ఇప్పటి వరకు నాగోబా సన్నిధికి రాని మెస్త్రం కోడళ్ళను వారి కుటుంబీకులు నాగోబా దర్శనం చేయించి, వంశ పెద్దలను పరిచయం చేయించి వారి ఆశీస్సులు పొందుతారు. దీనిని బేటింగ్ అంటారు. దీంతో నాగోబా జాతర ప్రారంభమైనట్లు మెస్రం వంశ పెద్దలు ప్రకటిస్తారు. ఈనెల 30న పెర్సపేన్ పూజలు పురుషులు మాత్రమే నిర్వహిస్తారు. భాన్ దేవతాకు పూజలు చేస్తారు. ఇందులో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొంటారు. 31న మంత్రులు, జిల్లా అధికారుల సమక్షంలో దర్బార్ నిర్వహించి గిరిజనుల సమస్యలను తెలుసుకుంటారు. ఫిబ్రవరి 1న భేతల్ పూజలు, మండ గాజిలింగ్ పూజలు చేయడంతో అధికారికంగా జాతర ముగుస్తుంది. కానీ ఆ తరువాత మరో మూడురోజుల వరకు జాతర రద్దీ కొనసాగుతుంది.

నాగోబా ఆలయ చరిత్ర

కేస్లాపూర్ గ్రామ గిరిజనుడు పడియేరు శేష సాయి నాగదేవతను దర్శించుకునేందుకు నాగలోకానికి వెళ్తాడు. అక్కడ నాగరాజు లేకపోవడంతో నిరుత్సాహంతో శేషతల్పం తాకి కేస్లాపూర్‌కు వెనుదిరుగుతాడు. శేషతల్పాన్ని మానవుడు తాకిన విషయం తెలుసుకుని నాగేంద్రుడు ఆగ్రహిస్తాడు. శేషసాయిని అంత మొందించేందుకు భూలోకానికి వస్తాడు. విషయం తెలుసు కున్న శేషసాయి ఏడు కడవల ఆవుపాలు, పెరు గు, నెయ్యి, తేనె, బెల్లం, పెసరపప్పు తదితర ఏడు రకాల నైవేద్యం సమర్పిస్తాడు. గోదావరి హస్తల మడుగు నీటిని 125 గ్రామాల మీదుగా తీసుకొచ్చి నాగరాజును అభిషేకిస్తాడు. కేస్లాపూర్ వద్ద ఉన్న పుట్టలోకి నాగరాజు వెళ్లి అక్కడే తన నివాసంగా మార్చుకుంటాడు. అప్పటినుంచి పుష్య మాసం అమావాస్య రోజున అర్ధరాత్రి మెస్త్రం వంశీయులు నాగోబాకు మహాపూ జలు నిర్వహిస్తున్నారు.

సంస్కృతి మరువని గిరిజనం

కాలం మారుతున్నా మెస్రం వంశీయులు తమ సంస్కృతిని వీడలేదు. ఒక ప్రణాళిక బద్ధంగా ఈ జాతరను నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. జాతర ప్రారంభానికి ముందు గోండు తెగకు చెందిన మెస్త్రం వంశీయులంతా కేస్లాపూర్‌లోని పటేల్ నివాసం వద్ద సమావేశం అవుతారు. అన్ని అంశాలు చర్చించాక జాతరపై ప్రచార కార్యక్ర మాన్ని ప్రారంభిస్తారు. ఎడ్లబండి (చకడ)లో కటోడా (పూజారి), ప్రధాన్ (పూజలకు సలహాదారుడు)లు కలిసి ముందుగా మహాపూజలకు అవసరమైన కుండల తయారీకి కుమ్మరులకు ఆదేశం ఇస్తారు. అనంతరం ఏడు రోజుల పాటు కటోడా, ప్రధాన్‌లు కలిసి ఎడ్లబండ్లపై మెస్త్రం వంశీయులున్న ఏడు గ్రామాలను సందర్శిస్తారు. జాతర నిర్వహణపై కబూర్ (ప్రచారం) అందిస్తారు. నాగోబాను అభిషేకించేందుకు గోదా వరినది నుంచి జలాలను తీసుకొస్తారు. అందుకోసం సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరినదికి కాలినడకన వెళతారు. ఈ మార్గాన్ని రూపొందించేందుకు మరోమారు సమావేశమవుతారు. ఎప్పుడూ ఒకే దారిలో కాకుండా, ఏటా ఒక్కో ప్రాంతం నుంచి ఈ జలయాత్ర సాగుతోంది. జన్నారం మండలంలోని హస్తినమడుగు వద్ద ఉన్న గోదావరి నదికి చేరుకుంటారు. నాగోబా ఆలయానికి కాలినడకన బయలుదేరుతారు.

ఇంద్రాయి దేవతకి పూజలు

తిరుగు ప్రయాణంలో ఆచారం ప్రకారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నెలకొని ఉన్న


ముస్తాబైన మూలవిరాట్టు

ఇంద్రాయి దేవతకి పూజలు నిర్వహిస్తారు. అదే రోజు కేస్లాపూర్ గ్రామ సమీపంలో ఉన్న మర్రి చెట్టు (వడమర్ర)కు చేరుకుంటారు. మరుసటి రోజు రాత్రి చనిపోయిన మెస్రం వంశీయులు పేరుతో తూం పూజలు నిర్వహిస్తారు. ఇక్కడ మూడు రోజుల పాటు వివిధ రకాల పూజలు జరుపుతారు. అనంతరం ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలు, డోల్, పేప్రే, కాలికోంల చప్పుళ్ల నడుమ ఆలయానికి చేరుకుంటారు.

మెస్రం వంశీయుల ఆడపడుచులు, అల్లుళ్ల

కొత్త కోడళ్ల పరిచయాలు

ముందుండి ఈ ప్రత్యేక పూజలన్నీ చేయిస్తారు. మహాపూజ రాత్రి 10 గంటల నుంచి 11 గంటల వరకు కొనసాగుతుంది. ఆ తరువాత అర్ధరాత్రి ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు మెస్త్రం వంశీయుల కుటుంబా ల్లో కొత్తగా పెళ్లి చేసుకున్న కోడళ్లను మెస్రం వంశం పెద్దలకు పరిచయం (బేట్టింగ్) చేయించి నాగోబాను చూపుతారు. వారి సంప్రదాయం ప్రకారం ఈ బెట్టింగ్ జరిగాకే ఆ మహిళలు నాగోబాకు పూజలు చేయడానికి అర్హులవుతారు. మహా పూజలు, బెట్టింగ్‌ల మరుసటి రోజు ఈనెల 30న ఆలయం వెనుక ఉన్న పేర్సపెన్ (పెద్దదేవత)కు పూజలు చేస్తారు. ఈ పూజలను కేవలం పురుషులు మాత్రమే నిర్వహిస్తారు. పూజలు జరుగుతున్న సమయంలో ప్రధాన్‌లు సాంప్రదాయ వాయిద్యాలను వాయిస్తుంటారు. తరువాత మట్టితో భాన్ దేవత విగ్రహాలను తయారు చేసి పూజలు చేస్తారు. గోవాడ్ (ప్రత్యేకకట్టడం) వద్ద మెస్రం వంశీయుల్లో ఉన్న 22 కితల (మెస్రం వంశంలోనే వివిధ వర్గాలు) వారీగా సంప్రదాయ పూజలు చేస్తారు. కుండల్లో వంటకాలను తయారు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. గోవాడ్‌లో కితల వారీగా 22 పొయ్యిలు ఏర్పాటు చేసుకుని సాంప్రదాయ వంటకాలను తయారు చేసి, కితల వారీగా సహపంక్తి భోజనాలు చేస్తారు.

నాగోబా దర్బార్‌కు ప్రత్యేకత

యేటా నిర్వహించే దర్బార్‌కు ప్రత్యేక స్థానం ఉంది. 77 ఏళ్ల క్రితం మారుమూల గ్రామాలకు ఎలాంటి సౌకర్యాలు లేవు. గిరిజనుల వద్దకు అధికారులెవరూ వెళ్లేవారు కాదు. అప్పుడే భూమి కోసం, విముక్తి కోసం జల్‌జంగల్‌తో పాటు హక్కుల సాధన కోసం నైజాం ప్రభుత్వంతో కుమ్రం భీం పోరాటం చేశారు. ఆయన పోరాటాల ఫలితమే గిరిజనులకు హక్కులు దక్కాయి. అప్పుడు గిరిజనుల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్ డార్ఫ్ జిల్లాకు వచ్చారు. కేస్లాపూర్‌లో గిరిజనులంతా ఏకమై జాతర నిర్వహించే విషయాన్ని తెలుసుకున్న ఆయన దీన్ని వేదికగా ఎంచుకున్నారు. గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు దర్బార్ ఏర్పాటు చేసి కూలంకుశంగా చర్చించారు. హైమన్‌డార్ఫ్ 1946లో మొదటి దర్బార్‌ను నాగోబా జాతరలో నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతియేటా ప్రజాదర్బార్‌ను గిరిజనులు నిర్వహిస్తున్నారు.

● **జాతరకు వెళ్లాలంటే...**

ఆదిలాబాద్ నుంచి (32 కి.మీ.) ప్రత్యేకబస్సులు నడుస్తాయి. హైదరాబాద్ నుంచి వచ్చే వారికి 44వ జాతీయ రహదారిపై గుడిహత్నూర్ మండల కేంద్రం నుంచి ఇంద్రవెల్లి కంటే ఐదు కిలోమీటర్ల దూరం ముందు ముత్నూర్ నుంచి కేస్లాపూర్‌కు రోడ్డుసౌకర్యం ఉంది.

● **450 మందితో పోలీసు నిఘా**

తెలంగాణలోనే రెండో అతిపెద్ద ఆదివాసి గిరిజన నాగోబా జాతరకు 450 మంది పోలీసులతో నిఘా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇద్దరు ఏఎస్పీలు, ఐదుగురు సీఐలు, 22 మంది ఎస్ఐలు పర్యవేక్షణ చేయనున్నారు.

● **ఏర్పాట్లు పూర్తి**

రాష్ట్ర ప్రభుత్వం నాగోబా జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసింది. అన్ని ఏర్పాట్లు చేసింది.

ఫటా..ఫట్...

కందుల కొనుగోలుకు సర్వం సిద్ధం

● గంగన్న (ఏఎంసీ కార్యదర్శి, కుభీర్)



ఆంధ్రజ్యోతి : కందుల కొనుగోలు కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

కార్యదర్శి : కందులు కొనుగోలు చేసేందుకు రైతులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాము. కంది పంట దిగుబడులు విక్రయించే రైతులకు సోమవారం నుంచి సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు టోకెన్లను అందిస్తున్నారు. టోకెన్లు పొందిన రైతుల నుంచి రోజుకు 500ల క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

ఆంధ్రజ్యోతి : కందులు విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు ఎప్పటివరకు జమ చేస్తారు.? మీరందించే మద్ధతు ధర ఎంత.?

కార్యదర్శి : కందులు విక్రయించిన రైతుల ఖాతాల్లో 72 గంటల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రైతులు విక్రయించే నాణ్యమైన కందులు క్వింటాలుకు రూ.7,550 మద్ధతు ధర అందిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి : ఈ ఖరీఫ్ నుంచి ఇప్పటి వరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటల వివరాలు ఎలా వున్నాయి. ?

కార్యదర్శి : మార్కెట్ ఆధ్వర్యంలో మండల రైతుల నుంచి 35,390 క్వింటాళ్ల సోయా, సీసీఐ ద్వారా 68,797 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశాము. ఈ సంవత్సరం ఇంక మొక్కజొన్న శనగ, జొన్న పంటలను కొనుగోలు చేస్తాము.

ఆంధ్రజ్యోతి : కుభీర్, పల్సి గ్రామాల్లో నిర్మించి గోదామ్‌లు ఉపయోగంలో ఉన్నాయ. వాటి ద్వారా నెలకు వచ్చే ఆదాయం ఎంత ?

కార్యదర్శి : గోదామ్‌లు ఉపయోగంలోనే ఉన్నాయి. కుభీర్‌లోని గోదాం ఖాళీగా ఉంది. పల్సి గ్రామంలోని ఏఎంసీ గోదాంలను తెలంగాణ స్టేట్ వేర్‌హౌస్ కార్పోరేషన్‌కు అద్దెకు ఇవ్వడం జరిగింది. 5600 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఈ గోదాంలకు నెలకు రూ.84,773 అద్దెచెల్లిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, కుభీర్)

గిరిజనేతరులను
లబ్ధిదారులుగా ఎంపిక చేయవద్దు

● ఆదివాసీ సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ సేన నాయకులు

గుడిహత్నూర్ , జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డులు, రైతుభరోసా నాలుగు పథకాల్లో గిరిజనేతరులను లబ్ధిదారులుగా ఎంపిక చేయడం ఏజెన్సీ చట్టాలకు విరుద్ధమని ఆదివాసీ సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్ అన్నారు. ఏజెన్సీలో నాలుగు పథకాలకు గిరిజనేతరులను ఎంపిక చేయవద్దంటూ కోరుతూ సోమవారం తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్ హైకు ఆదివాసీ సేన నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అనేది ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా గ్రామసభల ద్వారా చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అనర్హత గల గిరిజనేతరులను ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఎంపిక చేయడం వల్ల ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వమే అక్రమ వలసలను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. ఇకనైనా పాలక ప్రభుత్వాలు, స్థానిక ప్రజాప్రతి నిధులు, అధికారులు ఏజెన్సీ ప్రాంతంలో పథకాల అమలు విషయంలో ఏజెన్సీ ప్రాంత చట్టాలకు అనుగుణంగా మాత్రమే కార్యచరణ ఉండాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సేన జిల్లా కన్వీనర్ కుంరం చత్రుఘన్, ఆదివాసీ సేన జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పసుపు రైతులు

లోకేశ్వరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పసుపు రైతులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం, పసుపునీళ్ల అభిషేకం చేశారు. ముథోల్ శాసన సభసభ్యులు పవర్ రామారావు పటేల్ ఆదేశాల మేరకు, జిల్లా కార్యవర్గం సూచన మేరకు కార్యక్రమం నిర్వహించారు. నిజామాబాద్‌లో సంక్రాంతి రోజున జాతీయ పసుపు బోర్డు ప్రారంభించినందుకుగాను లోకేశ్వరం మండలం గడ్‌చందా గ్రామంలోని పోగుల సాయన్న పసుపు వ్యవసాయ క్షేత్రంలో ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నల్ల రమేష్ గడ్‌చందా, మాజీ ఎంపీటీసీ జీవన్, మండల ఓబీసీ మోర్చా కార్యదర్శి ఓడ్నాల మురళి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు అనసూయ, పసుపు క్షేత్ర యజమాని పోగుల సాయన్న, పసుపు రైతులు విలాస్, మాజీ సర్పంచ్ భూమన్న, దేవేందర్, ప్రశాంత్, కే. భూమన్న, ప్రదీప్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా


పాత వెంకూర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కుంటాల, జనవరి, 27: (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన గ్రామసభల్లో ఆరు గ్యారంటీల అమలుపై సోమవారం కుంటాల మండలంలోని పాత వెంకూర్ గ్రామంలో కళాజాత ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరుగ్యారంటీల అమలుతో పాటు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగపరుచుకునే తీరుపై అవగాహన కల్పించారు. అంతేగాకుండా మాదక ద్రవ్యాలు వాడితే కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి, కళాకారులు పాటలు, మ్యాజిక్‌షో, మిమిక్రీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శితో పాటు కళాకారులు లక్ష్మణ్, రఘునాథ్, సుధాకర్, నాగరాజు, జితేందర్, మాధవి, సుదర్శన్, తస్లిమా సుల్తానా ఉన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలలో సీసీ కెమెరాలతో నిఘా

నిర్మల్‌రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు వచ్చేనెల 3వ తేదీ నుంచి 22 వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షల్లో అక్రమాలకు తావ్వికుండా ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించడంతో పాటు పరీక్షలు జరిగే కేంద్రాల్లో ప్రతి గదిలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గతంలో పలుమార్లు ప్రాక్టికల్ పరీక్షలకు జంబ్లింగ్ విధానం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ చివరి సమయంలో ఆచరణలోకి రాలేదు. ఈసారి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రాక్టికల్ పరీక్షల కోసం అధికారులు జిల్లాలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుల కోసం 37 పరీక్షా కేంద్రాలను, ఒకేషనల్‌కు 9 పరీక్షా కేం ద్రాలను ఏర్పాటు చేశారు. సెకండ ఇయర్ ఎంపీసీ విభా గంలో 2,159 మంది, బైపీసీలో 2,118 మంది, ఒకేషన్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 1,196 మంది, సెకండ్ ఇయర్ విద్యార్థులు 1,355 మంది ఉన్నారు. పరీక్షలను మూడు విడతల్లో నిర్వహిస్తామని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి

● జాదవ్ పరశురాం, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, నిర్మల్



ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు కళాశాలలకు ఉత్తర్వులు జారీ చేశాం. విద్యార్థుల కోసం జిల్లాలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈసారి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సీసీ కెమెరాలు ఏర్పా టు చేస్తున్నాం. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.



వన మహోత్సవానికి పకడ్బందీ ప్రణాళిక

ఖానాపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించడంలో ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేకపోయారని ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈసారి నిర్వహించే వన మహోత్సవాన్ని విజయవంతం చేసే దిశగా జిల్లా అధికార యంత్రాంగం వినూత్న చర్యలు చేపడుతోంది. 2025-26 సంవత్సరానికి గాను జిల్లాలో 63.99 లక్షల మొక్కలు నాటడమే టార్గెట్‌గా ముందుకు సాగుతుంది. జిల్లావ్యాప్తంగా 31 ప్రభుత్వ శాఖలకు లక్ష్యాలను కేటాయించిన ప్రభుత్వం ఇది వరకే నర్సరీలలో సదరు మొక్కల పెంపకాన్ని ముమ్మరం చేసింది. గతంతో పోలిస్తే ఈసారి వన మహోత్సవంలో విభిన్నమైన మొక్కలను నాటేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే విధంగా వన మహోత్సవంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా చర్యలు చేపడుతోంది. గత పరిస్థితులు పునరావృతం కాకుండా ఈసారి వన మహోత్సవాన్ని విజయవంతం చేసేలా పకడ్బందీ ప్రణాళికలకు శ్రీకారం చుట్టింది.

- జిల్లాలో ఈ ఏడాది 63.99 లక్షలు మొక్కలు నాటడమే లక్ష్యం
- ఈత, తాటి వనాలతో పాటు హెర్బల్ ప్లాంట్స్‌కి ప్రాధాన్యత
- నివాస సముదాయాలలో పెరుగనున్న కరివేపాకు, నిమ్మ, దానిమ్మ
- ప్రతీ ఒక్కరికితో ఇష్టమైన వారి పేరిట మొక్కలు నాటించే యత్నం
- తద్వారా మొక్కలు కాపాడడంలో గ్రామస్థులు భాగస్వామ్యం

జిల్లా టార్గెట్ 63.99 లక్షలు

జిల్లాలో ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా 63 లక్షల 99 వేల 977 మొక్కలను నాటడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు గాను 31 ప్రభుత్వ శాఖలకు టార్గెట్లు విధించారు. ఇందులో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 7,935, బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సివిల్‌సప్లై ఆధ్వర్యంలో 2,645, జిల్లా సహకారశాఖ ఆధ్వ ర్యంలో 6,613, విద్యాశాఖ ఆధ్వర్యంలో 11,638, డీఆర్డీవో పరిధిలోని డ్వామ ఆధ్వర్యంలో 14,54,750, ఐకేపీ ఆధ్వర్యంలో 14,54,750, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 4,36,425, విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో 6,613, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 6,613, ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో 6,613, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 72,738, మత్స్యశాఖ ఆధ్వర్యంలో 66,125, అటవీశాఖ ఆధ్వర్యంలో 7,27,375, వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వయంలో 33,063, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో 1,45,475, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 13,225, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 6,613, మాధ్యమిక విద్యాశాఖ ఆధ్వర్యంలో 13,225, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో 6,613, మైనింగ్‌శాఖ ఆధ్వర్యంలో 13, 225, మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 6,613, మున్సిపాలిటీ పరిధిలో 5,81,900, భైంసా మున్సిపాలిటీ పరిధిలో 5,81,900, ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 2,90,950, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వరయంలో 21,821, పోలీసుశాఖ ఆధ్వర్యంలో 2,18,213, రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో 14,548, రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో 58,190, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 13,225, ఐటీడీఏ ఆధ్వరయంలో 6,613, యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో 6,613, జిల్లా పంచాయతీరాజ్ శాఖ (డీపీవో పరిధిలో) ఆధ్వరయంలో 14,548, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో 66,125, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 19,838 మొక్కలను నాటడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 31 శాఖల పరిధిలో 63,99, 977 మొక్కలను నాటనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకు గాను జిల్లా వ్యాప్తంగా 402 నర్సరీలలో మొక్కల పెంపకాన్ని చేపట్టినట్లు చెబుతున్నారు.

హెర్బల్‌ప్లాంట్స్‌కి పెరుగనున్న ప్రాధాన్యత

జిల్లావ్యాప్తంగా ఈసారి వన మహోత్సవంలో భాగంగా హెర్బల్ మొక్కలను పెంచేందుకు జిల్లా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా అలోవెరా, అశ్వగంధ లాంటి మొక్కలకు ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెబుతున్నారు. వీటితో పాటు ఈత, తాటి వనాలను పెంపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈత వనాల ఏర్పాటు కోస నర్సరీలలో ఈత మొక్కల పెంపకాలను సైతం నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నివాస సముదాయాలలో పెంపొందించే మొక్కలలో ఈ ఏడాది అలంకరణ మొక్కలను పూర్తిస్థాయిలో నిషేధించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ అలంకరణ మొక్కల స్థానంలో కరివేపాకు, నిమ్మ, దానిమ్మ లాంటి మొక్కలను పెంపొందించడం ద్వారా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందనే లక్ష్యంతో ఈసారి ఆ మొక్కల పెంపకంపై దృష్టి సారించినట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు వినూత్న ఎత్తుగడ

వన మహోత్సవంలో నాటిన మొక్కలను కాపాడుకునేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని గుర్తించిన అధికార యంత్రాంగం ఆ దిశగా విజయం సాధించేందుకు వినూత్న ఎత్తుగడలను ఈసారి అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇదివరకే కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 'నాటుదాం ఒక మొక్క అమ్మ పేరిట' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని దాని స్ఫూర్తితో జిల్లాలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఒక్కొక్కరికి వారికి ఇష్టమైన వారి పేరిట మొక్కలను నాటించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అలా చేయడం ద్వారా సదరు వ్యక్తులు నాటిన మొక్కలను వారే కంటికి రెప్పలా కాపాడుకుంటారని అధికార యంత్రాంగం భావిస్తోంది. ఈ వినూత్న ఎత్తుగడలో విజయం సాధిస్తే నివాస సముదాయాలలో నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. మరోపక్క గ్రామస్థాయిలో హరిత రక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మొక్కల సంరక్షణను పర్యవేక్షించేలా ప్రతి గ్రామానికి ఓ మండల స్థాయి అధికారిని, మండలానికి ఓ జిల్లా స్థాయి అధికారికి బాధ్యతలను అప్పగిస్తున్నారు. మొత్తానికి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వన మహోత్సవంలో నాటిన మొక్కలను సంరక్షించడం కోసం అధికారులు పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేసి వాటిని అమలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు.

హెర్బల్ ప్లాంట్స్ పెంపకంపై ప్రత్యేక దృష్టి



జిల్లాలో ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా 63.99 లక్షల మొక్కలను నాటేలా ప్రణాళికలు రూపొందించాం. ఈసారి ఈత, తాటి వనాలతో పాటు హెర్బల్ ప్లాంట్స్ పెంపకంపై దృష్టి సారించాం. నివాస సముదాయాలలో అలంకరణ మొక్కల పెంపకాన్ని పూర్తిగా నిషేధిస్తూ ప్రజలకు నిత్యం ఉపయోగపడే కరివేపాకు, నిమ్మ, దానిమ్మ లాంటి మొక్కలు పెంచేలా చర్యలు చేపడుతున్నాం. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి వన మహోత్సవంలో మొక్కలను కాపాడడంలో సక్సెస్ అవుతాం.

విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్

మున్సిపల్ ప్రత్యేక అధికారిగా
బాధ్యతలు స్వీకరించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్



బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్ అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మున్సిపల్ ప్రతినిధుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ... నిర్మల్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహకరించాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేకశ్రద్ధ కనబరిచి, నిర్మల్ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమయానికి అన్ని రకాల పన్నుల వసూలును పూర్తి చేయాలన్నారు. నిర్మల్ మున్సిపాలిటీ ప్రగతికి సంబంధించి నివేదికలను ఎప్పటికప్పుడు తమకు అందజేయాలని తెలిపారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ హరిభువన్, పట్టణ ప్రణాళిక అధికారి హరీష్, ఆర్‌వో అనూఫ్, మెప్మా పీడీ సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భైంసా మున్సిపల్ ప్రత్యేకాధికారిగా ..

భైంసా, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో సోమవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన మొదలయ్యింది. ఆదివారం పాలక వర్గాల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారులను నియమిచింది. జిల్లాలోని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ ఆహ్మద్‌కు జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగానే సోమవారం మధ్యాహ్నం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ ఆహ్మద్ భైంసా మున్సిపల్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర ప్రసాద్, మేనేజర్ గౌరిష్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి ప్రత్యేక తరగతులకు హాజరు కావాలి



ఉపాధ్యాయులకు సూచనలను ఇస్తున్న డీఈవో

సారంగాపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి ప్రత్యేకతరగతులకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈవో రామారావు అన్నారు. సోమవారం మండలంలో గల చించోలి(బి)లో పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలను ఇచ్చారు. పాఠశాలలోని తరగతి గదులతో పాటు మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీరోజు విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాన్ని చేయాలన్నారు. విద్యార్థులకు సబ్జెక్టులపై అవగాహన కల్పించాలన్నారు. ఈయన వెంట ఎంఈవో మధుసూదన్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వానల్‌పాడ్ పాఠశాలకు విరాళాల అందజేత

భైంసా రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వానల్‌పాడ్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు ఉపాధ్యాయులు బి.జలపతిరెడ్డి, జే.అమిత్ నాయక్‌లు విద్యార్థుల తాగునీటి అవసరాలను గుర్తించి రూ. 14,000లు విలువ చేసే శుద్ధ జల యంత్రంను విరాళంగా అందించారు. బీజేపీ నాయకులు బి.సాయరెడ్డి రూ. 5,000ల విలువ గల రెండు టేబుళ్లను పాఠశాల విరాళంగా అందజేశారు. బది లీపై వెళ్లిన ఉపాధ్యాయుడు కృష్ణమాచారిరూ. 7000లను విరాళంగా అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భైంసా, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లోని 8ఎంవీఏ పవార్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్న దృష్ట్యా భైంసా పట్టణంలో పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్స్ పరిధిలో గల ప్రాంతాల్లో విద్యుత్ సరపరా ఉండబోదని వివరించారు. నిర్మల్ రోడ్, ఓవైసీనగర్, రాజీవ్‌నగర్, మోమైనామ్ గల్లీ, ఏక్‌మినార్ ఏరియా, మదీనా కాలనీ, పల్సీ ఫీడర్, స్పిన్నింగ్ మిల్ ఫీడర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా పేర్కొన్నారు. విద్యుత్ వినియోగాదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

నిర్మల్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సోఫీనగర్ గురుకుల బాలికల విద్యాలయంలో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని విద్యుత్‌శాఖలో లైన్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న సామల వేణుగోపాల్‌రెడ్డిని సన్మానించినట్లు ప్రధానోపాధ్యాయుడు డానియల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ఐదు సంవత్సరాల నుంచి మంచి నీటి వ్యవస్థకు చెందిన మోటార్లు, వాటి మరమ్మతులు కానీ, నూతన మోటార్లు బిగించడం, పైప్ లైన్లు మరమ్మతులు చేయించడం వంటి కార్యక్రమాలు సొంత ఖర్చులతో చేయించారని తెలిపారు. 640 మంది విద్యార్థులకు ఎలాంటి నీటిసమస్య రాకుండా చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్పన, మేరీ, సారిక, నవనీత, నారాయణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని
డీసీసీ అధ్యక్షుడికి వినతి



సోన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంజాల్ టోల్ ప్లాజాలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇటీవల ఫేర్వెస్టోల్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీ టోల్ ప్లాజాను కాంట్రాక్ట్ తీసుకుందని, కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించేందుకు సిద్ధమైందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించేలా చూడాలని కోరారు. స్పందించిన డీసీసీ అధ్యక్షులు ఎన్‌హెచ్‌ఐ పీడీతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్‌కు పరామర్శ

నిర్మల్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన మాజీ పురపాలక సంఘం మాజీ ఉపాధ్యక్షులు వాజిద్ అహ్మద్‌ఖాన్ సోదరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం రోజు డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సారం గాఫూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, సబా కలీం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణ మాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరచాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. అనంతరం పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేక అధికారులంతా ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ, పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాలన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పరీక్ష ఫలితాల వివరాలను అందజేయాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మండల స్థాయి అధికారులతో పాటు వివిధ శాఖల ఉద్యోగులందరూ ఈ ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ప్రజల ఫిర్యాదులను స్వీకరించి సత్వరమే సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, సిబ్బంది శనివారాలు శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండలాల్లో పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల నిర్మాణానికి స్థలాలను గుర్తించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు క్రీడాకారులను అభినందించిన ఎస్పీ



జిల్లా పోలీస్ క్రీడాకారులతో ఎస్పీజానకి షర్మిల

నిర్మల్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్టేట్ పోలీసు స్పోర్ట్స్ మీట్ కు ఎంపికయిన జిల్లా పోలీస్ సిబ్బంది 16 మందిని సోమవారం ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల అభినందించారు. ఇటీవల వివిధ క్రీడల్లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు క్రీడాకారులను జోనల్ సెలక్షన్‌కు పంపించారు. వీరు బాసర జోన్‌లోనూ ఎంపికయ్యారు. కరీంనగర్‌లో జరగబోయే తెలంగాణ స్టేట్ పోలీసు స్పోర్ట్స్ మీట్ పాల్గొంటారని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగే స్టేట్ మీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి తప్పనిసరిగా మెడల్ వచ్చే విధంగా ఆడి ఆల్ జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఏఎస్పీ రాజేష్ మీనా, స్పోర్ట్స్ టీం పోలీస్ సిబ్బందిని అభినందించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజావాణిలో ఫిర్యాదుల అర్జీల స్వీకరణ

ప్రజావాణిలో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల ఎస్సై, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడారు. సమస్య స్థితిని పరిష్కారం చేసినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

బీసీలు రాజ్యాధికారంలోకి రావాలి : కేఏపాల్



నిర్మల్ అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఓట్లు మనవి అధికారం మాత్రం రెండు వర్గాలకే పరిమితమైంది. ఇప్పటికైనా బీసీలు, ఎస్టీలు, ఎస్సీలు, మైనార్టీలు మేలుకొని బీసీలను రాజ్యాధికారం చేసే విధంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ పిలుపునిచ్చారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ప్రజాశాంతి పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలన రావాలని మాజీ సర్పంచ్‌లతో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కేవలం ఒక్కశాతం ఓటు శాతం ఉన్న రావులు, ఐదు శాతం ఓట్లు ఉన్న రెడ్డిలు రాజ్యాధికారం కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా బీసీలు, మైనార్టీలు, ఎస్సీలు, ఎస్టీలు ఏకతాటి పైకి వచ్చి బీసీలకు రాజ్యాధికారం వచ్చే విధంగా పోరాడాలని అందుకు వేదికగా రానున్న సర్పంచ్ ఎన్నికల్లో ప్రజాపార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ఒక్కొక్క గ్రామానికి కోటి రూపాయలు నిధులు కేటాయిస్తానని ఆయన ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థులకు హామీ ఇచ్చారు. 78 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారంలో ఉండి దేశానికి చేసింది ఏమీ లేదని, అదే విధంగా బీజేపీ పార్టీ సైతం నడుస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల అప్పులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 11 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజలను నడి రోడ్డున పాడేశారని, కేంద్ర ప్రభుత్వం సైతం లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి అప్పులు వడ్డీలకు సరిపోతుందని దేశం ఎలా ముందుకుపోతుందని ప్రభుత్వాలను ఆయన ప్రశ్నించారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన బీజేపీ 11 ఏళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధి కొరకు సర్పంచ్ నిధులతో పనులు చేస్తే ఇప్పటికీ వాటి బిల్లులను ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు తమ గోడును కేఏ పాల్ ముందట వెళ్లబోసుకున్నారు. లక్షల రూపాయలు అప్పులు చేసి రోడ్లు, డ్రైనేజీలు, వైకుంఠధామాలు నిర్మించామని, బిల్లులు ఇవ్వడం లేదని ఆరోపించారు. మాజీ సర్పంచ్‌లు ఆందోళన కార్యక్రమాలకు ప్రజాశాంతి పార్టీ ఎప్పుడు ఉంటుందని వారికి హామీ ఇచ్చారు.


రోడ్డు ప్రమాదంలో మంజులాపూర్ వాసి మృతి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సోన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గోదావరి పుణ్యస్నానం చేసేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. సోన్ ఏఎస్సై షేక్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం... నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ గ్రామానికి చెందిన పోతా గౌడ్(65) అనే వ్యక్తి సోమవారం మండలంలోని మాదాపూర్ గ్రామం వద్ద గల పుష్కర ఘాట్ వద్ద పుణ్య స్నానానికి వెళ్తుండగా ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు అతివేగంగా వస్తున్న కారు పోతాగౌడ్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. పోతాగౌడ్‌ను వెంటనే అంబులెన్స్‌లో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నిర్మల్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారికి వినతిపత్రం ఇచ్చినట్లు జిల్లా అధ్యక్షులు భూక్యా రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మార్కెట్ ధరలకు అనుగుణంగా ధరలు లేనందున తమ సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొనవ్వ, చిట్యాల లక్ష్మీ, రూప, లలిత, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు హాజరైన కాంగ్రెస్ నాయకులు

కుంటాల జనవరి, 27: (ఆంధ్రజ్యోతి) : మండల మాజీ జడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న అత్తమ్మ కొత్తపల్లి నర్సమ్మ మృతి చెందారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి కృష్ణవేణి పాల్గొన్నారు.